## నవ్య వీక్లి - పసుపులేటి లక్ష్మీనారాయణ స్మృతిసాహితి కథల పోటీలో


# రూ. 2,000 ప్రోత్సాహక బహుమతి పొందిన కథ

మన సంస్కృతి- సమిష్టి కుటుంబం. మనం మాత్రం పూజలు, మ్రొక్కులు, భక్తి వగైరాలను- ఒంటిపిల్లి రాకాసులమై పాటిస్తూ- అదే మన సంస్కృతి అనుకుంటూ- ప్రచారం కూడా చేస్తున్నాం. శ్రీ కంతా జ్యూయలర్స్ ఐదువేల రూపాయలు దాటి కొనుగోలు చేసినవారందరికీ ఓ లక్కీ డ్రా ప్రకటించినప్పుడు నాకీ విషయం మరోసారి స్ఫురించింది. డ్రాలో ప్రథమ బహుమతి- ఓ జంటకి ఉచితంగా ఆమెరికా యాత్ర కావడం అందుక్కారణం.

నా సుపుత్రుడు ఆరేళ్లుగా అమెరికాలోనే సతీసుత సమేతంగా ఉంటున్నాడు. మధ్యలో ఓ రెండు సార్లు ఇండియా వచ్చి వెళ్లాడు. నా భార్య అరుంధతికి అమెరికా చూడాలన్న కోరికేం పెద్దగాలేదు కానీ- చుట్టుపక్కల వాళ్లూరుకుంటారా- మీ అమెరికా ప్రయాణమెప్పుడని ఒకటే సొద!


# అమ్మా నాన్న మనవడు

వసుంధర



కావడానికి పవిత్ర భారతనారి ఐనా- ఉపవాసం పేరు వింటేనే గడగడలాడిపోయే అరుంధతికి- ఇరుగు పొరుగులతో కబుర్లు లేకపోవడం కూడా కఠిన ఉపవాసం కిందే లెక్క. అమెరికాలో కబుర్లకి ఇరుగు పొరుగు లుండరని తెలిసినా- బొజ్జ (వి)నాయకులక్కూడా ఓట్లకోసం వరద బురద నీటిలో పాదయాత్రలు తప్పవు కదా- అలాగే ఇరుగుపొరుగుల కోసం అరుంధతికీ అమెరికా యాత్ర తప్పదనిపించింది. అందుకే తననోసారి అమెరికా తీసుకెళ్ళమని నోరువిడిచి అడిగింది పుత్రరత్నాన్ని.

ఎందరో పిల్లలు- తమ పిల్లల సంరక్షణ కోసం- తలిదండ్రుల్ని అమెరికా రప్పించుకుంటున్నారు కానీ- అదేమిటో మావాడు మాత్రం అందుకు సుముఖంగా లేడు. అక్కడ మీరొక్క రోజు కూడా ఉండలేరని భయ పెడతాడు. మేము భయపడక పోతే- తనకున్న అప్పులన్నీ తీరేదాకా- తీసుకెళ్లలేనని అసహాయత ప్రకటిస్తాడు. వాడి అప్పులెప్పుడు తీరతాయన్నదో చిక్కు ప్రశ్న. అమెరికా వెళ్లగానే కారు కొనడానికి అప్పు చేసాడు. అది తీరేలోగా ఇల్లు కొనడానికి అప్పు చేసాడు. అది ఇప్పట్లో తీరేది కాదట. ఈలోగ వాడి పెళ్లాం కూడా ఉద్యోగంలో చేరింది- ఆర్థికంగా వెసులుబాటు కోసం కాదు, కొత్త సరదాలకి కొత్త అప్పులు చేయడానికి. ఆ సరదాల జాబితాలో మా అమెరికా ట్రిప్పు చేరినట్లు లేదు.



ఐనా సరిపెట్టుకునేవాళ్లమే- మావాడి అత్తమామలు అప్పుడే రెండుమార్లు అమెరికా వెళ్లి రాకపోతే! ''మీ వియ్యంకుడూ, వియ్యపురాలూ వెళ్ళొచ్చారుటగా, మరి మీరెప్పుడు?'' అని ఇరుగుపొరుగులడిగాకనే వాళ్ల మొదటి ప్రయాణం గురించి అరుంధతికీ, ఆమె ద్వారా నాకూ తెలిసింది.

అప్పుడు అరుంధతి- మొగుడు కొట్టినందుక్కాదు, తోడికోడలు నవ్వినందుకన్నట్లు- కుమిలిపోయింది కానీ కొడుకుని నిలదీసేందుకు అభిమాన పడింది. ఈలోగా వియ్యాలవారు రెండోసారి అమెరికా వెళ్లొచ్చినట్లు మళ్లీ ఇరుగుపొరుగుల ద్వారానే వినేసరికి పుండుమీద కారం చల్లినట్లయింది తనకి.

అప్పుడిక ఆగలేక- అభిమానం కూడా మరిచి కొడుకుని నిలదీస్తే, ''వాళ్లు మమ్మల్ని చూడాలన్న అభిమానంకొద్దీ టికెట్ ఖర్చులు పెట్టుకునొచ్చారు. కూడా ఫారిన్ ఎక్స్ఛేంజ్ తెచ్చుకుని, ఇక్కడ మాకూ అవీఇవీ కొనిపెట్టారు. మీరలా కొనిపెట్టక్కర్లేదు కానీ, టికెట్ ఖర్చులు పెట్టుకోండి. నేనిక్కడ మిమ్మల్ని నెత్తిమీద పెట్టుకుని చూస్తాను'' అంటూ మావాడు బ్రహ్మాస్త్రం ప్రయోగించాడు.

ఒకప్పుడు- ''వాడిది మీ పోలిక కాదు, నా పోలిక'' అని గర్వంగా చెప్పుకునే అరుంధతి- ఇప్పుడు ''అంతా మీ పోలికే'' అని నామీద నిష్ఠూరం వేసేసేది! కానీ ఇప్పుడామె పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కయింది- ఏం చేస్తాం- అంతా స్వయంకృతం! అదెలాగంటే...

అరుంధతికి తనో మహాపతివ్రతనని మహా నమ్మకం. పతివ్రత అంటే కేవలం పతికి మాత్రమే అంకితం కావాలని ఆమె భాష్యం. అందుకు అత్తమామలు అడ్డమని- పెళ్లైన ఆర్నెల్లకే నా చేత వేరు కాపురం పెట్టించింది. ఆ తర్వాతనుంచి ఇంట్లో వాళ్ల ప్రసక్తి రావడమే అపరాధమన్నట్లు మసిలేది. క్రమంగా నాకూ మావాళ్లకీ మధ్య బంధాలు పూర్తిగా తెగిపోతే- తర్వాతనించి నేనూ ఆమె పాతివ్రత్యానికి పూర్తి సహకారమందించాను. అందుకు నాన్న నన్ను తప్పు పట్టలేదు, ''కోడలు సుడిగాలి. మావాడు గాలివాటం మనిషి. మానుంచి ఎగిరిపోవడం సహజం'' అని బంధుమిత్రులకు నా గురించి తనే సంజాయిషీ ఇచ్చుకునేవాడు.

నాకైతే అరుంధతి సాహచర్యం బాగుంది. ఐనవాళ్లకి దూరం కావడమూ బాగుంది. స్వంత లాభం కోసం అరుంధతి గాలివాటంలో పయనిస్తూ- అది నా అసహాయతగా ఐనవాళ్లని భ్రమింపజేసి- నింద ఆమె మోస్తుంటే, సానుభూతి నేను దక్కించుకునేవాణ్ణి.

నా సుపుత్రుడిదీ నా పోలికే అనడం నిందే తప్ప పొగడ్త కాదు. అదీ అరుంధతినే ముల్లై గుచ్చుతుంది. అసలు సంగతేమిటంటే- అరుంధతి పాతివ్రత్యం గురించి బంధువర్గంలో విస్తారంగా ప్రచారముంది. మా కోడలు పెళ్లికిముందే అరుంధతికి ఏకలవ్య శిష్యురాలు. పెళ్లయ్యేక గురువుని మించిన శిష్యురాలైంది. పెళ్లైన మర్నాడే మాకూ వియ్యాలవారికీ తెగింది. తర్వాత మాకూ- మావాడికీ అనుబంధం నామమాత్రం! ''మన బంగారం మంచిదైతే...?'' అంటాను నేను- అమ్మా నాన్నలు నా గురించి అనుకునేది గుర్తు చేసుకుని. అరుంధతి ఒప్పుకోదు- అలాగని కోడల్నీ తప్పు పట్టదు. పతివ్రత కదా- మంచికైనా చెడుకైనా పతినే నమ్ముకుంటుంది. ''వాడు అమెరికాలో ఉద్యోగం సంపాదించి పెళ్లాన్ని పువ్వుల్లో పెట్టి చూసుకుంటున్నాడు. మీరు పెళ్లానికి కనీసం ఒక్కసారి అమెరికా చూపించలేరా?'' అని నన్నే నిష్ఠూరమాడింది.

అమెరికా ప్రయాణమంటే మాటలా- లక్షలతో పని. ఉన్న కాస్త నిల్వల్నీ అలా స్వాహా చేస్తే- ఆ తర్వాత మనుగడకి కొడుకుముందే దేహీ అని నిలబడాలి. అందుకని- కొంత డబ్బుతో కొద్దిగా షేర్లు కొన్నాను. కొద్దిగా మ్యూచువల్ ఫండ్సులో పెట్టాను. అదృష్టం బాగుంటే- ఒక్క రోజులో నా పెట్టుబడి వంద రెట్లు కావచ్చని ఆశ. కానీ చాన్నాళ్లుగా సెన్సెక్స్ మూడడుగులు ముందుకీ- ఆరడుగులు వెనక్కి. ఇక లాటరీయే దారి అనుకుంటున్న తరుణంలో శ్రీకంఠా జ్యూయలర్స్ ఉచిత అమెరికా ప్రయాణం లక్కీ డ్రా ప్రకటించారు. ఐదు వేల పర్చేజికో లాటరీ టికెట్! అరుంధతికో నగ, అమెరికా ప్రయాణం ఆశ.

నా ఆలోచన అరుంధతికి తెగ నచ్చేసింది. ఇరవై వేల పెట్టుబడితో నాలుగు టికెట్స్ తీసుకుందామంది. కానీ నా బడ్జెట్ ఐదు వేలే మరి! అలాగని హోరు గాలిలో దీపం పెట్టలేదు. నా మిత్రుడు ఆనందరావుని కూడా ఈ లక్కీ డ్రాకి ప్రోత్సహించాను. వాడు నిరాసక్తంగా ఉంటే చివరికి బ్రతిమాలాను కూడా.

అరుంధతి చిరాకుపడి, ''డ్రాలో ఉంటే- అమెరికా ఛాన్స్ ఆయనే దక్కించుకుంటాడు. అసలే ఆయనది లక్కీ హ్యాండు'' అని చాటుగా నన్ను మందలించింది.

''లక్కీ హ్యాండనే వాణ్ణి బ్రతిమాలడం! డ్రాలో నెగ్గినవాళ్లే అమెరికా వెళ్లాలని రూల్లేదు. తమ బదులు ఎవర్నైనా పంపించొచ్చు. వాడికి- ఆ ఎవరో- అంటే మనమే మరి'' అన్నాను.

ఇక్కడ ఆనందరావు గురించి కొంత చెప్పాలి.

నాకులాగే వాడిదీ అరవై ఐదేళ్ల వయసు. ముప్ఫై ఐదేళ్ల వయసు కొడుకు అమెరికాలో సిటిజనై రమ్మని పిలుస్తుంటే- రానుపొమ్మంటున్నాడు. అందుక్కారణం ఈ మట్టిమీద మమకారం కాదు.

తొంభైకి దగ్గిరపడుతున్నా ఇంకా మట్టిలో కలవని కన్నవారిపై మమతానుబంధం. అది వాడి దురదృష్టమంటుంది అరుంధతి. మహా పతివ్రత అంటే- భర్తకోసమే జీవించాలన్న భావంతో కాపురానికొచ్చిన కొద్ది నెలల్లోనే నాచేత వేరు కాపురం పెట్టించిన తనకా అభిప్రాయం సహజం.

అది నా అదృష్టం అంటాను నేను.

ఏదో కథలో చెప్పినట్లు ఆనందరావు ముట్టుకుంటే మట్టి బంగారమౌతుంది. అది వాడికీ తెలుసు. ఐనా తను ప్రచారం చేసుకోడు. నాకది స్వానుభవమైనా నేనూ ప్రచారం కానివ్వను. మరి నా స్వార్థం నాది!

ఆనందరావు తండ్రి గొప్ప పండితుడు, వక్త. సభల్లో పురాతన సాహిత్యాంశాలపై ఆసక్తికరమైన విశేషాలు చెప్పేవాడు. దేవాలయాల్లో పురాణాలని వ్యాఖ్యానించేవాడు. గ్రామంలో పూర్వీకులిచ్చిన పొలంమీద వచ్చే దానికా ఆదాయం- వేణ్ణీళ్లకి చన్నీళ్లు. పట్నంలో ఉంటున్న ఇల్లు చిన్నదైనా స్వంతమే కావడం- మరో వెసులుబాటు. పాండిత్యాన్ని సొమ్ము చేసుకుంటే- ఆయన లక్షలార్జించేవాడని నాన్న అనేవాడు.

నాన్న గుమాస్తా. జీతం తక్కువ. గీతం దొరికే సీటు కాదు. అందుకని జాతకాలు, జోస్యం- హాబీగా చేసుకున్నాడు. బ్రతకనేర్చిన మనిషిగా పేరుపడ్డ ఆయన సంపాదనలో- హాబీయే వేణ్ణీళ్లు. జీతం చన్నీళ్లు. ఆనందరావుకి ఓ తమ్ముడు, చెల్లెలు. నాకూ అంతే. మా పోలిక అంతటితో చెల్లు. చిన్నప్పట్నించీ ఆనందరావు పద్ధతి మనిషి. నాది గాలివాటం. మావి పక్క పక్క ఇళ్లే ఐనా, మేమిద్దరం చదివేది ఒకే స్కూల్లో ఒకే క్లాసే ఐనా- వాడితో పొసగక- కాస్త దూరంగా ఉండేవాణ్ణి.

అది కనిపెట్టిన నాన్న నన్నోరోజు పిలిచి. "నీది గాలివాటం. వాడిది అదృష్ట జాతకం. వాడితో తిరుగు. అదృష్టపు గాలి నిన్ను బాగుపడే చోట్లకి ఎగరేసుకుపోతుంది" అని హితబోధతో మందలించాడు. నాన్న మాట విని బాగుపడ్డ వాళ్ళెక్కువ. వినక చెడినవారూ ఎక్కువే. ఆ విషయం సోదాహరణంగా నాన్నే ఇంట్లో ప్రచారం చేసుకునేవాడు. నేను కేవలం ఆయన మాటలు నమ్మాననుకుందుకు లేదు. నేను ఆనందరావుతో స్నేహం మొదలెట్టాక, ఆయన ఉదాహరణలకి నావీ కొన్ని జతపడ్డాయి.

వాడితో కలిసి స్కూలు కెడితే- ఆకాశం మేఘావృతమైనా క్లాసు రూం చేరేదాకా వాన పడదు. వాడి పక్కన కూర్చుంటే- ఆల్‌జీబ్రా పాఠం కూడా అరటిపండొలిచినట్లు అర్థమయ్యేది. వాడితో కంబైన్డ్ స్టడీస్ చేస్తే- కలిసి చదివిన పాఠాల్లో ప్రశ్నలే- పరీక్షలో వచ్చేవి. వాడితో వెడతానంటే నాన్న నన్ను సినిమాలకి కూడా పంపేవాడు. వాడు పక్కనుంటే- ఎన్టీఆర్, ఏయన్నార్ల రిలీజులక్కూడా- ఫస్ట్ డే- మామూలుగా టికెట్స్ దొరికేసేవి.

వాడు పక్కనుంటే- ఎక్కడికెళ్లినా నాకు గౌరవ మర్యాదలు లభిస్తుంటే- నా వంతుగా నేనూ సంతోష పెట్టాలని- ఒకసారి వాడి అదృష్టాన్ని తెగ పొగిడాను. కానీ ఆనందరావు అదృష్టాన్ని ఏమాత్రం నమ్మడు!

"దినచర్యకి క్రమశిక్షణనీ, వ్యవహారానికి నిజాయితీనీ, అనుబంధాలకి మంచితనాన్నీ, ఫలితాలకి స్వయంకృషినీ నమ్ముకోవాలి. దుఃఖాన్ని కలిగించే దురాశ, అహంభావాన్ని రగిల్చే అతిశయం, అసహనాన్ని పెంపొందించే అసూయ, అవివేకాన్ని ప్రోత్సహించే కోపం, పరోపకారానికి పురిగొల్పే స్వార్థం- వదులుకోవాలి. అలా చేసి పొందగలిగిన నిత్య సంతోషమొక్కటే మనిషి అదృష్టం" అన్నాడు ఆనందరావు.

వాడికిలా ఆలోచించనందుకు చిన్నతనమనిపించింది. "ఇదంతా నీకు మీ నాన్న చెప్పి ఉండాలి. నాకు మా నాన్న- అదృష్టం గురించేతప్ప ఇలాంటివేం చెప్పడు" అని కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేసాను. ఆనందరావు దీనికీ ఒప్పుకోలేదు, "పెద్దలు చెప్పేవీ, ఇంట్లోవాళ్లు అనుకునేవీ, పుస్తకాల్లో చదివేవీ, క్లాసు పాఠాల్లో వినేవీ- శ్రద్ధగా పట్టించుకుని- వాటిలో చెడుని తీసేసి- మంచిని అవగాహన చేసుకోగల నేర్పు- ప్రతి మనిషికీ ఉంటుంది. నేనివి అలా నేర్చుకున్నవే- నాకెవరూ చెప్పలేదు" అన్నాడు.

వాడి మాటల్ని బట్టి- నా అవగాహనా లోపానికి- నాన్నని తప్పు పట్టినందుకు మందలించాడనిపించింది. ఆ తర్వాత కూడా నేను వాడికిలా మారలేదు, మారాలని ప్రయత్నించలేదు. ఎందుకంటే వాడి అదృష్టం జాతకంలోకాక- ప్రవర్తనలోనో, వ్యక్తిత్వంలోనో ఉండొచ్చు. కానీ వాడి నంటిపెట్టుకునుంటే చాలు- అందులో కొంత నాకూ అంటుతోంది. నేను నాకులాగే ఉంటూ కూడా వాడి దురదృష్టం. కానీ అది నా అదృష్టం. అందుకే నేను 'అదృష్టమంతుణ్ణి చెరిపే వాడూ లేడూ, అదృష్టాన్ని స్వంతం చేసుకోవచ్చు. వాడికిలా ఉండడం కష్టం. ఇంకా చెప్పాలంటే అలా ఉండడం వాడి దురదృష్టవంతుణ్ణి బాగుచేసేవాడూ లేడు'- అంటే- ఒప్పుకుంటాను. ఎవరి కర్మకి వారే కర్తలు అంటే తల అడ్డంగా ఊపుతాను. మరి ఆనందరావు దురదృష్టం- నా అదృష్టం ఐతే- నా కర్మకి నేనుకాదు- వాడే కర్త కదా!

ఆనందరావు భార్య అనుకూలవతి. తనకి అనుకూలంగా మలచుకున్నాడని కొందరంటారు. వాడి తమ్ముడికి కలకత్తాలో పెద్ద ఉద్యోగం. చెల్లెలు విశాఖపట్నంలో స్థిరపడింది. అంతా పచ్చగా ఉన్నా- కన్నవారు మాత్రం గత నలభై ఏళ్లుగా ఆనందరావుతోనే ఉంటున్నారు. మిగతావాళ్ల దగ్గిరకి వెళ్లినా- అది చుట్టపు చూపే! "కన్నవారి ప్రేమ అరుదైన వరం. అది ఈ వయసులో కూడా పొందడం నా అదృష్టం" అంటాడు వాడు. అది మాకు దక్కడం లేదని వాడి తమ్ముడు, చెల్లెలు గోల పెడతారు. వాడి కొడుకుదీ అదే పితూరీ. "అమెరికా వెళ్లి కొన్నాళ్లు కొడుకు దగ్గిరుండి రా. అందరికీ తృప్తిగా ఉంటుంది" అని నేను ఆనందరావుకి చాలాసార్లే చెప్పాను. ఒకసారి మాత్రం చిత్రమైన బదులిచ్చాడు.

వాడి తమ్ముడు ఉద్యోగంతో బిజీ. మరదలు సంఘ సేవతో బిజీ. పిల్లలు ఎదుగుదలకోసం బిజీ. వాడి బావ పెద్ద వ్యాపారంలో బిజీ. చెల్లెలు చిన్న వ్యాపారంలో బిజీ. పిల్లలు ఏదో ఒకలా బిజీ. "కన్న ప్రేమ అందించడానికి అమ్మా నాన్నా రెడీగా ఉన్నా- అందుకునే టైము వాళ్లకి లేదు. నా దగ్గిరున్నప్పుడే వాళ్లని చూడ్డానికి ఏటికోసారి కూడా వీలు కాదు- వాళ్ల దగ్గిర శాశ్వతంగా అమ్మానాన్నల్ని ఎలా వదలను? నెలకోసారైనా ఫోన్లో హలో అనడానికి సిద్ధంగాలేని పిల్లలతో వాళ్లకెలా కాలక్షేపమౌతుంది? ఇచ్చి పుచ్చుకునే రెండు తీగలు కలిస్తేనే కరెంటు దీపం వెలుగుతుంది. కన్నవారి ప్రేమా అటువంటిదే. ఏదో లోకానికి వెరచి అలా అంటున్నారు కానీ- అమ్మా నాన్నా నాదగ్గిరుండడం మా వాళ్లకి సంతోషమే!" వాడికి సంబంధించి ఆ మాటల్లో నిజముందని నాకు తెలుసు.

వాడింట్లో అంతా కలిసి భోంచేస్తారు. కలిసి టీవీ చూస్తారు. కలిసి రోజూ రెండు గంటలైనా కబుర్లు చెప్పకుంటారు. వాడింటికి వెడితే- నలుగురు విడి మనుషులున్నారనిపించదు. ఆ నలు



గురూ ఓ యూనిట్ అనిపిస్తుంది. అక్కడున్నంత సేపూ ఆ యూనిట్ ఇచ్చే సంతోషం, సంతృప్తి ఎంతలా ప్రభావితం చేస్తాయంటే, మనమూ అలాగే ఉండాలనిపిస్తుది. అక్కణ్ణించి బయటపడ్డా కగానీ- వాస్తవంలోకి రాలేం.

అలా కలిసుండాలంటే- జీవితంలో ప్రైవసీ పోతుంది. భార్యాభర్తలే వేర్వేరు వ్యక్తిగత జీవితాలు కోరుకుంటున్న రోజులివి- తలిదండ్రుల పేరు చెప్పి ఆనందరావు జీవితంలో చాలా కోల్పోతున్నాడని పించదూ! పార్టీలకి వెళ్లలేడు. సినిమాలు చూడ లేడు. యాత్రలు చేయలేడు. వృద్ధాప్యంలో ఉన్న తలిదండ్రులకి- వృద్ధాప్యంలో ఉన్న తనూ, భార్యా సేవలు చేయాలి.

వయసులో ఉన్నప్పుడే అత్తమామలు భారమను కున్న అరుంధతికి- ఈ వయసులో ఆనందరావు జీవితం దుర్భరమనిపిస్తుంది. నాకు అరుంధతి నా భార్య కావడం అదృష్టమనిపిస్తుంది. కానీ వాణ్ణి చూస్తే మనసులో ఏదో అపరాధభావం వాడినీ జీవి తానికి వ్యతిరేకంగా ప్రబోధించమని ప్రోత్సహిస్తుంది.

ఎవరికైనా కన్నబిడ్డలే అయువుపట్టు కాబట్టి- "నీ తమ్ముడూ, చెల్లెలి సంగతి సరే! మరి కన్న కొడుకు సంగతేమిటి? నీకు నీ కన్న వారిమీదు న్నట్లే- వాడికీ తన కన్న వారి మీద మమకారముం డదా?" అన్నానోసారి.

దానికి వాడు, "నిన్ను నీ కన్నవారు ప్రేమించి నట్లు నువ్వు వాళ్లని ప్రేమించగలిగేవా?" అన్నాడు. చిత్రమేమిటంటే- వాడేమన్నా నాకు కోపం రాదు. ఉన్న విషయాన్ని నిర్ద్వంద్వంగా చర్చించడమే తప్ప ఇతరుల్ని నొప్పించే ఉద్దేశ్యం వాడికి ఉండదు. ఇప్పుడూ అంతే! నాతో తన కొడుకుని పోల్చుతు న్నాడు. "మా నాన్నకి నేనంటే అసంతృప్తి ఉంది. నీకూ మీవాడంటే అసంతృప్తి ఉందా?" అన్నాను.

వాడు నవ్వి, "వాడు నామీద ఆధారపడితే- ఏమో కానీ- వాడిప్పుడు తనంతటివాడయ్యాడు. నచ్చిన పద్ధతిలో జీవించే హక్కు వాడికుంది. వాడి జీవితంలో జోక్యం చేసుకునే హక్కు నాకు లేదు" అన్నాడు.

"వాడి దగ్గిరకెడితే- వాడి జీవితంలో జోక్యం చేసుకుంటానని భయమా నీకు?" అన్నాను.

"అలాంటి భయాలు నాకు లేవు. కానీ వాడికి ఆర్థికంగా, హోదాలో- ఇంకా ఇంకా ఎదగాలని కోరిక. ఉద్యోగం చేస్తూనే ఏమేమో కోర్సులు చేస్తు న్నాడు. రెండేళ్లకోసారి ఉద్యోగాలు మారుతున్నాడు. వాడి భార్యదీ అదే పద్ధతి. వాళ్లిద్దరూ ఎదుగుదల కిచ్చిన ప్రాధాన్యం సంసార జీవితానిక్కూడా ఇవ్వ లేదు. ఒక స్థాయి చేరుకునే దాకా పిల్లలు కూడా వద్దనుకున్నారు. ఆ స్థాయికెప్పుడు చేరుకుంటారో కానీ- మావాడికిప్పుడు ముప్పై ఐదు. కోడలు వాడి కంటే రెండేళ్లు చిన్నదేమో! ఇంకా పిల్లలు లేరు" నిట్టూర్చాడు వాడు.

"నువ్వు వాళ్ల దగ్గిరకెళ్లి ఉండడానికి అభ్యంతర మేమిటో నాకర్థం కాలేదు" అన్నాను.

"చెప్పానుగా- ప్రేమ ప్రవాహానికి రెండు తీగ

## సంప్రదాయపు వారసత్వం కోసం...



వసుంధర మా కలం పేరు. జొన్నలగడ్డ రాజగోపాలరావు, రామలక్ష్మి మా అసలు పేర్లు. నవ్యకి అభిమానులం. నవ్య పాఠకులకి పరిచితులం. నవ్య నిర్వహించిన కథల పోటీల్లో పాల్గొనడం ఇదే ప్రథమం. సంగీతంలో శంకర శాస్త్రి-శిష్యుడు జంటలా (చిత్రం; శంకరాభరణం), సంసారంలో పెద్దలు-పిల్లలు సంప్రదాయపు రసానుభూతిని వారసత్వంగా తరతరాలకూ కొనసాగించాలన్న అభిలాష ఈ కథకి ప్రేరణ. మా మనుమడు, మనుమరాండ్రతో స్వానుభవం ఈ కథకి స్ఫూర్తి. పిల్లల పెంపకం తలిదండ్రులకూ, పెద్దల్ని ఆదరించడం పిల్లలకీ- బాధ్యతా నిర్వహణగా మారిపోతున్న నేటి యాంత్రిక వాతావరణానికి హెచ్చరికగా రూపొందిన ఈ కథకి ఈ పోటీ అదనపు స్ఫూర్తి, ప్రేరణ.

**-వసుంధర**
**శ్రీవాణి గిరిజ నిలయం,**
**63 సాకేత్ ఫేజ్ 1, కాప్రా,**
**ఇసిఐఎల్ పోస్టు,**
**హైదరాబాద్ - 500 062**
**ఫోన్: 040 27144697**

లుండాలని! బిడ్డల్నే కనకూడదనుకున్న వాడికి- కన్నవారు మాత్రం అవసరమా? వాడికి మామీద ప్రేమ, అభిమానం, గౌరవం- అన్నీ ఉన్నాయి. మేము దగ్గిరుంటే వాడికి సంతోషమే! అద్దె ఇంట్లో మనకిష్టమైన వాళ్లుంటే ఉండదూ- అలాంటి సంతోషమన్న మాట! అలాంటి వాడి సంతోషం కోసం- నేను నన్ను కన్నవారిని వదిలి వెళ్లలేను. అది బాధ్యత అనుకోను. ఈ వయసులో కూడా కన్న వారి ప్రేమ లభించడం నా అదృష్టం. అది వదులు కోలేని స్వార్థపరుణ్ణి నేను" అన్నాడు వాడు.

"నీ గురించే తప్ప- నీ భార్య గురించి ఆలోచించని నువ్వు స్వార్థపరుడివే" అన్నాను.

ఆనందరావు నవ్వి, "బాగా చెప్పావ్- పెళ్లయ్యేక ఆడది భర్తని స్వార్థపరుడిగా మారుస్తుందంటారే- అది నిజం. నన్నీ స్వార్థానికి పురిగొల్పింది- నా భార్యే!" అన్నాడు.

ఏమనాలో తెలియలేదు నాకప్పుడు. వాడి భార్యకి అత్తమామలు కన్నవారికంటే ఎక్కువ. వాడి తల్లిదండ్రులకి కోడలు కన్న కూతురికంటే ఎక్కువ. కర్తలెవరూ అన్న మీమాంస వృథా. ఉన్న విషయమే అది! ఏదేమైనా ఆనందరావు కన్నవారిని విడిచి అమెరికా వెళ్లే అవకాశమే లేదని నాకు రూఢి అయింది. అందుకే వాడిది లక్కీ హ్యాండని తెలిసీ- నేను శ్రీకంఠా జ్యూయలర్స్‌లో నగల కొనుగోలుకి బలవంతపెట్టాను. వాడు సరేనని- మా ఇద్దర్లో ప్రథమ బహుమతి ఎవరికొచ్చినా అది నాదేనని కూడా- తేల్చి చెప్పేసాడు. షాపింగుకి నేనూ, అరుంధతీ, ఆనందరావు భార్యా ఆటోలో బయ ల్దేరాం. ఆనందరావు కన్న వారికి తోడుగా ఇంట్లో ఉండిపోవాల్సొచ్చిందని- అరుంధతి వాడి గురించి తెగ జాలిపడింది.

ఆటోలోనే అరుంధతి నస మొదలైంది. తనకి ఉంగరం కొనుక్కోవాలనుకుంది కానీ తులం పది హేనువేలుంది బంగారం. పదివేలైనా పెట్టందే- మరీ అలికిగా ఉంటుందంటుంది. సపోర్టుకి ఆనం దరావు భార్యనడిగితే, "నేను మా అత్తగారికి దుద్దులు కొందామనుకుంటున్నా. ఐదువేలకి మంచివే వస్తాయి" అందామె.

"మరి నీకేం కొనుక్కుంటావూ?" అంది అరుం ధతి కుతూహలంగా.

"ఏదో- అన్నయ్యగారడిగారని కదా- ఈ షాపింగు! ఐదువేలతో అత్తయ్యకి దుద్దులు కొనేస్తే- డ్రాలో మన పేరు నమోదైపోతుంది. ఇక నాకెం దుకూ?" అందామె.

అప్రయత్నంగా ఆమెని చూస్తే- ముఖంలో ఏమాత్రం అసంతృప్తి లేదు. కానీ నా భార్యకి నమ్మకం కుదర్లేదు. ఎవరి పనిమీద షాపింగు కెళ్లినా- తనకంటూ చిన్న పర్చేజైనా చేసుకోని ఆడది ఉండదని ఆమె అభిప్రాయం. అందుకు తనే ఉదా హరణ కూడా. అందుకని, "ఇప్పుడలాగంటున్నావ్ కానీ- షాపుకెళ్లేక నిలబడాలి ఈ మాట మీద" అంది. ఆమె మాట నిలబెట్టుకోకూడదన్న ఆశ గొంతులో ధ్వనించింది.

షాపుకి వెళ్లేక- ఆనందరావు భార్య అత్తగారి అభిరుచిని దృష్టిలో ఉంచుకుని ఎన్నిక చేసిన పింకు రాళ్ల దుద్దులకి ఐదువేల రెండొందల ఇరవై అయింది. బేరమాడి ఐదు వేలకి ఒప్పించిందామె.

తర్వాత ఆమె అరుంధతికి ఉంగరం బేరంలో సహకరించింది. మజూరీ ఎక్కువనీ, మెరుపు తక్కు వనీ, రాళ్లకి ఛాయిస్ లేదనీ వంకలెన్నో- ఆరు వేల ఉంగరాన్ని- ఐదువేల ఆరొందలకి బేరం చేసింది. అరుంధతి కూడా తప్పనిసరై, "అమెరికా ట్రిప్పు ఫ్రీగా వచ్చినా- పెళ్లాం కోసం మరో రెండుమూడు వేలు ఖర్చు పెట్టలేరు. మహా పిసినారి మీరు" అని గునుస్తూ ఆ పల్లాటి ఉంగరం తీసుకుంది. నాకు తెలుసు- షాపులోనే ఉంగరం పదేపదే వేలికి పెట్టు కుని మురిసిపోవడం అరుంధతి అలవాటని. కానీ అవతల ఆనందరావు భార్య అత్తకోసం కొంటే- తను కేవలం తనకోసమే కొన్నానన్న కాంప్లెక్స్- అదుపు చేసిందామెని. సందు చూసుకుని, "ఇక మీదట ఈవిడతో నో షాపింగ్" అంది నా చెవిలో.

చూసి నేర్చుకునే అలవాటు లేని అరుంధతికి అలాగనడం ఇది మొదటిసారి కాదు. తనకి బేర మాడ్డం రాదు. ఆనందరావు భార్య బేరాల్లో దిట్ట. చెరువుమీద అలిగే టైపు కాదు నా భార్య.

షాపింగయ్యేక మేము ఆనందరావు ఇంటికెళ్లాం. వాడి తల్లి- అరుంధతి ఉంగరం చూసి, "నీ ఛాయిస్

బాగుందమ్మా!'' అని మెచ్చుకుంది. అప్పుడు అరుంధతి మాటవరసక్కూడా ఆనందరావు భార్య ప్రసక్తి తేలేదు, ''అదేంటో- అంతా అలాగే అంటారు నా గురించి'' అని సంబరపడింది.

ఆనందరావు భార్య తన గురించి ఏమీ చెప్పకుండా, ''వదిన ఛాయిస్ నిజంగానే గొప్పది అత్తయ్యా! మీ దుద్దులూ తనచేతే ఎన్నిక చేయించా, ఎలా ఉన్నాయో చెప్పండి'' అంటూ అత్తకి దుద్దులు చూపించింది. ఇక అరుంధతిలో టెన్షన్. ఆమె బాగోలేదంటే- నెపం తన మీదకొచ్చేస్తుంది. ఐనా పరాయివాళ్లు ఎన్నిక చేసారంటే- చటుక్కున ఎవరూ బాగోలేదనలేరు కదా! ''అమ్మో, జగజ్జంత్రి'' అని ఆనందరావు భార్య గురించి తననుకున్నట్లు తర్వాత నాకు తెలిసింది.

ఆనందరావు తల్లి అరుంధతిమీద ప్రశంసల జల్లు కురిపించింది కానీ, అవి చిన్నవాళ్లకెక్కువ బాగుంటాయని కోడల్నే పెట్టుకోమని నొక్కిస్తే, ''అభిమానం కొద్దీ మీరలా అంటారు కానీ- మనింటికి కొత్తగా ఎవరొచ్చినా- మీరు కోడలు, నేను అత్త అంటారు. అలా కూడా ఇవి మీకే నప్పుతాయి'' అంది ఆనందరావు భార్య. వాళ్లలా పోటీపడుతుంటే- చూడముచ్చట అనిపించింది. చివరికి- ఇద్దరూ మార్చి మార్చి పెట్టుకునేలా నిర్ణయమైంది. తర్వాత స్వార్థంతో అరుంధతి, ఆమె స్వార్థాన్ని నిరసిస్తున్నట్లు భ్రమిస్తూ నేనూ ఇంటికెళ్లాం.

అప్పట్నించి నేను డ్రా కోసం ఎదురు చూస్తున్నా కానీ ఆనందరావు ధ్యాసే వేరు.

వాడు డిజిటల్ కెమేరాలో ఇద్దరికీ ఫొటోలు తీసి- కాపీలు తీయించి ఇచ్చాడు. అత్త దుద్దులు పెట్టుకున్నప్పుడు- కోడలి ఫొటో చూసుకుని మురిసిపోయేది. తను దుద్దులు పెట్టుకున్నప్పుడు కోడలూ అంతే! ''ఇద్దరికీ అవంతగా నచ్చినప్పుడు- చెరో సెట్టూ కొనాల్సింది. డ్రాలో మనకీ అవకాశం పెరిగేది'' అన్నాను ఆనందరావుని మందలించే అవకాశమొచ్చింది కదా అని.

దానికి ''మార్చి మార్చి పెట్టుకుంటాం కదా- ఒకే రకం రెండెందుకూ- ఇదైనా డ్రా కోసం కొన్నాం కానీ- లేకుంటే- మాకున్న దుద్దుల సెట్లు తక్కువా?'' ఆనందరావు తల్లి రిటార్టు.

కౌరవులు నూర్గురే కావచ్చు- కానీ ధర్మరాజుకి నూట ఐదుగురు. ఉమ్మడి కుటుంబాల్లో సామరస్యముంటే- ఆ జీవితమెంత బాగుంటుందో నేను ఆనందరావు ఇంట్లో కళ్లారా చూస్తున్నాను. ఐతే భారతం విని ఎంత నేర్చుకున్నానో, వాణ్ణి చూసీ అంతే నేర్చుకున్నాను- అసలు సిసలు భారతీయుడిలా. అదేమిటో- ధర్మరాజునీ, ఆనందరావునీ మెచ్చుకునే వారే కానీ- అనుసరించాలనుకునేవారు మన దేశంలో అరుదు.

అదే నాకు మంచిది. ఆత్రుతగా ఎదురు చూస్తున్నా- లక్కీ డ్రా తీసే ఆ శుభఘడియల కోసం. అప్పుడందిందో కబురు చల్లగా. ఆనందరావు కొడుకు, కోడలు- పిల్లలు కావాలని నిర్ణయం తీసుకున్నారుట. ఇప్పుడు ఆనందరావు కోడలుకి ఐదో నెల. గర్భంలో ఉన్నది మగ బిడ్డట.

చావు కబురే కాదు, పుట్టుక కబురూ చల్లగా ఉంటుందని అర్థమై గుండె గుభేల్మంది. ''ఇద్దరూ ఉద్యోగాలు చేస్తున్నారు. వాళ్లకిప్పుడు మీ సాయం అవసరమేమో'' అన్నాను- ఔననేయడుకదా అని భయపడుతూ. ''ఒకరికి సాయం చేసే వయసా మాది. అక్కడి పిల్లలకోసం డే కేర్ స్కూల్స్ ఉంటాయి. అవే వాళ్లకి శ్రీరామరక్ష'' అని వాడంటే, ''మరి మనవణ్ణి చూడ్డానికైనా ఓసారి వెళ్లవా?'' అన్నాను ఇంకా భయం చావక. ''మావాడే ఇక్కడికొస్తే- అమ్మా నాన్న కూడా ముని మనవణ్ణి చూస్తారుగా'' అన్నాడు వాడు. వాడి మనసు మారేలోగా- డ్రా అయిపోవాలని తెలిసిన దేవుళ్లందరికీ దణ్ణం పెట్టుకున్నాను. ఆ దణ్ణాలు ఫలించాయి. ఆనందరావు అదృష్టం మరోసారి ఋజువు చేస్తూ- వాడిదే ప్రథమ బహుమతి. వాడు మాట నిలబెట్టుకుని అమెరికా యాత్రకి నా పేరు సిఫారసు చేసేసాడు. ఇక అరుంధతి ఆనందానికి పట్టపగ్గాలు లేవు. తాత్కాలికంగానే ఐనా ఆనందరావుని ఎందరి వద్దనో పొగిడిందామె.

మాకు టూరిస్ట్ వీసా వచ్చింది. ఆరు వారాల అమెరికా యాత్రకి రానూపోనూ టికెట్ రెడీ అయింది. ఇక ప్రయాణం పన్నెండు రోజులుందనగా- ఆనందరావు నా దగ్గిరకొచ్చి, ''రెండు రోజులు అమ్మనీ నాన్ననీ చూడాలి మీ దంపతులు. మేమిద్దరం వీసాకోసం చెన్నై వెడుతున్నాం'' అన్నాడు.

ముందు షాక్. తర్వాత భయం. తను వెళ్లకపోతే ఏమోకానీ- ఎంత మంచివాడైనా- ఫ్రీ టికెట్స్ నా పరం చేసి- తను స్వంత ఖర్చులమీద అమెరికా వెడతాడా అని అనుమానం.

నా భయోద్వేగ సందేహాల్ని పటాపంచలు చేస్తూ, ''నేనక్కడికి తన ఖర్చుమీదే రావాలని మావాడి పట్టుదల. కాబట్టి ఆ ఫ్రీ టికెట్స్ నీవే! అదీ కాక మనవడు పుట్టేకనే అక్కడికి వెడదామనుకుంటున్నాం. వెళ్లేక కనీసం ఆర్నెల్లుంటాం. ఎక్స్‌టెన్షనొస్తే- మరో ఆర్నెల్లుంటాం. కాబట్టి నీ టికెట్స్ నాకు అక్కరకి రావు'' అన్నాడు.

అప్పటికి తేరుకుని ఫీలింగ్సులో ఆశ్చర్యానికి చోటివ్వగలిగాను, ''మరి మీ అమ్మా నాన్నా?''

''కొన్నాళ్లు తమ్ముడి దగ్గిరా, కొన్నాళ్లు చెల్లి దగ్గిరా ఉంటార్రా! వాళ్ళకెంతిష్టమో తెలీదు కానీ- అమ్మా నాన్నా ఊఁ ఇదైపోతున్నారు- కొంతకాలమైనా వాళ్ల దగ్గిరకెళ్లి ఉండకపోతే- తమ్ముడికీ, చెల్లికీ- చెడ్డ పేరొస్తుందని! గట్టిగా రమ్మనరు కానీ, వెడితే వాళ్లూ వాళ్లని బాగానే చూసుకుంటారని నా నమ్మకం''

''ఏమిటో- అంతా కలలా ఉంది. మరి నువ్వు 'కన్నవారి ప్రేమ అరుదైన వరం. అది ఈ వయసులో కూడా పొందడం నా అదృష్టం' అనేవాడివి. మనవడొస్తున్నాడనేసరికి అన్నీ గాలికి కొట్టుకుపోయేయా?'' అది వ్యంగ్యం కాదు, కుతూహలం.

ఆనందరావు నిట్టూర్చి, ''మనవడికి చంటప్పట్నించీ- డే కేర్- అనేసరికి ఇంటిల్లపాదీ అప్సెట్టయ్యాం రా. మా ఇంట్లో అందరూ ఎంతోకొంత ఐనవాళ్ల ఆప్యాయతని చవి చూసినవారే! అరుదైన కన్నవారి ప్రేమ రుచిని మనవడికి చూపించి- మన సంస్కృతి చెయిన్ తెగిపోకుండా చూడమని అమ్మా నాన్న చెప్పారు. అది మేమే కాదు- చెల్లీ, తమ్ముడూ కూడా ఓకే చేసారు. ఇది మా కుటుంబపు సమిష్టి నిర్ణయం. మా మనవడికి లభించే ప్రేమానురాగాలు గమనించేక- మా అబ్బాయీ, కోడలూ కూడా తమ జీవన విధానాల్ని మార్చుకుంటారేమో- ఎవరు చూడొచ్చారు?'' అన్నాడు.

ఆనందరావు అదృష్టాన్ని స్వంతం చేసుకున్న మేము వాడికంటే ముందు అమెరికా వెళ్లాం. మా అబ్బాయీ, కోడలూ, మనుమడూ, మనుమరాలూ- మా సంస్కృతి చెయిన్ మెయింటైన్ చేయడంతో- మా ట్రిప్ నెల్లాళ్లలో ముగించుకొచ్చాం.

ఆనందరావు అమెరికా వెళ్లి ఎనిమిది నెలలైంది. ప్రస్తుతం మేమా దంపతుల గ్రీన్‌కార్డ్ ప్రోసెసింగ్‌కి డాక్యుమెంట్స్ ప్రోసెస్ చేస్తూ, ''నీలాంటి ఫ్రెండు మా అదృష్టం'' అని వాడిచేత అనిపించుకుంటున్నాం.

*

కవిత



## ఎలాగోలా..

ఎలాగోలా బతికేయడానికి అలవాటు పడ్డాం
ఎవరేమనుకున్నా సరే
మనం, మన కుటుంబం, మన పల్సర్లు/ మన నానో
మనసెల్ బాలన్స్, మన ఏటీఎం కార్డు బాలెన్స్ ఉంటే
ఎవరేలా పోతే నాకేంటి,
నా పిల్లవాడి కాన్వెంట్ సీట్/కార్పొరేట్ కాలేజీ చదువు
దొరికితే చాలు..
మంచి - చెడుల మధ్య నున్న సన్నటి తెరను
చించేసుకొని బురఖాలాగా వాడుకుంటూ
నెపం ఎవరిమీదో నెట్టేస్తూ
రోలింగ్ స్టోన్లా రోజులు దొర్లించేస్తున్నాం!
నిత్యం ఆత్మను చంపుకుంటూ - చస్తూ బతుకుతున్న
బతుకూ ఒక బతుకేనా అని అర్ధరాత్రి
దుప్పట్లో ప్రశ్నించుకుని తెల్లారి
మరలా మాస్క్‌తో ప్రత్యక్షమవుతుంటాం!
ఎన్నాళ్లు మోసకారి బతుకులు?
అతకని మనసుల జతలు..
ప్లాస్టిక్ పువ్వుల నవ్వుల రువ్వులు..

-కె.కె.కుమార్ వర్మ